‘మాతృవందన’ మరిచారా?

- పీఎంఎంవీవై పథకానికి ఆరువేల మంది దరఖాస్తులు
- పథకం లబ్ధికోసం ఏడాదిగా ఎదురుచూపు
- ఎప్పుడు నగదు జమ అవుతుందో తెలియక ఆందోళన

ఇబ్రహీంపట్నం: ఆర్థికంగా వెనుకబడిన మహిళలు గర్భిణులుగా ఉన్న సమయంలో ఆర్థిక భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై)ను ప్రవేశ పెట్టింది. ఈ పథకం కింద మహిళలు గర్భం దాల్చిన సమయం నుంచి బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత మొదటి కాన్పుకు రూ.5 వేలు, రెండో కాన్పులో ఆడబిడ్డ పుడితే మరో రూ.6 వేలు మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తారు. అయితే గత ఏడాదిగా పథకం అమలు కాకపోవడంతో రిజిస్ట్రేషన్‌లు చేసుకున్న సుమారు 6 వేల మంది గర్భిణులు, బాలింతలు పథకం అమలు కోసం ఎదురుచూస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పథకాన్ని ఐసీడీఎస్ వారికి అప్పగించడంతో పథకం అమలు నిలిచిపోయింది.

పథకం ముఖ్య ఉద్దేశం ఇది..

గర్భిణులు, నవజాత శిశులకు సమగ్రమైన పోషకాహారం అందించడం పథకం ముఖ్య ఉద్దేశం. పోషకాహారంతో పాటు మందులు, వైద్యశాల ఖర్చులను భరించేందుకు పథకం సహాయ పడుతుంది. మొదటి కాన్పులో తల్లులకు మూడు విడతలుగా రూ.5 వేల నగదును బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తారు. గర్భధారణ సమయంలో పీహెచ్‌సీల్లో గర్భవతిగా నమోదు చేసుకున్న సమయంలో రూ.3 వేలు, బిడ్డపుట్టి టీకాలు వేసిన అనంతరం మరో రూ.2 వేలు జమ చేస్తారు. రెండో కాన్పులో ఆడబిడ్డ పుడితే మరో రూ.6 వేలు చెల్లిస్తారు. తల్లి, బిడ్డ ఆరోగ్యం మెరుగు పర్చడమే పథకం ప్రధాన ఉద్దేశం.

శాఖల మధ్య సమన్వయ లోపమే కారణమా..

కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహించే పీఎంఎంవీవై పథకాన్ని గతంలో వైద్యారోగ్య శాఖ నిర్వహించేది. ప్రస్తుతం రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖకు అప్పగించారు. ఏడాదిన్నర క్రితం వైద్య ఆరోగ్య శాఖ నుంచి మహిళా సంక్షేమ శాఖకు అప్పగించారు. గర్భిణులు, నవజాత శిశువుల నమోదు చేసే పనులను ఐసీడీఎస్ శాఖకు అప్పగించారు. దీంతో రెండు శాఖల మధ్య సమన్వయ లోపంతో పథకం ముందుకు సాగడం లేదు. మైలవరం నియోజకవర్గ పరిధిలో 2024వ యేడాది మధ్య కాలం వరకు మహిళల ఖాతాల్లో నగదు జమ అయింది. ఆ తర్వాత నగదు జమ కాలేదు. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోనే మైలవరం నియోజకవర్గం పరిధిలోని సుమారు ఆరు వేల మంది గర్భిణులు రిజిస్ట్రేషన్ చేయించుకుని నగదు కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఐసీడీఎస్ పరిధిలో మరో 1,500 మంది కొత్తగా రిజిస్ట్రేషన్ చేయించునేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈసారైనా సక్రమంగా వివరాలు నమోదు చేసి నగదు జమ అయ్యేలా చూడాలని గర్భిణులు కోరుతున్నారు.



ఇబ్రహీంపట్నంలో చిన్నారులతో వెల్‌బేబీ షోలో పాల్గొన్న బాలింతలు (ఫైల్)



జి.కొండూరులో గర్భిణులకు సీమంతం చేస్తున్న ఎంపీపీ, ఐసీడీఎస్ అధికారులు (ఫైల్)

దరఖాస్తు ఇలా..

మాతృవందన యోజన స్కీమ్ కింద లబ్ధిపొందేందుకు లబ్ధిదారుని వయస్సు 19 ఏళ్లు కలిగి ఉండాలి. కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షల కంటే తక్కువ ఉండాలి. ప్రభుత్వం మంజూరు చేసిన బీపీఎల్ కార్డు, ఉపాధి హామీ పథకం కార్డు, ఈశ్రమ్ కార్డు, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కార్డులో ఏదో ఒకటి కలిగి ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగులు కుటుంబాల వారు ఈ పథకానికి అనర్హులు. అర్హత కలిగిన గర్భిణులు సమీప అంగన్‌వాడీ కేంద్రం, ఆశా వర్కర్‌ను సంప్రదించాలి. ఆధార్‌కార్డు, గర్భధారణ ధ్రువీకరణ పత్రం, పిల్లల జనన ధ్రువీకరణ పత్రం, పోస్టాఫీస్, బ్యాంక్ ఖాతా వివరాలు సమర్పించిన వారు మాతృ వందనం యోజన కింద నగదు పొందే అవకాశం ఉంది.

ఏడాదిగా నగదు జమ కాలేదు

నాకు ఇద్దరు ఆడపిల్లలు. మొదటి కాన్పులో ఆడబిడ్డ పుట్టగా, రెండో కాన్పులో కూడా అమ్మాయికి జన్మనిచ్చా. పీఎంఎంవీవై పథకానికి ఏడాది కిందట నమోదు చేశా. ఇప్పటికీ రూపాయి జమకాలేదు. అధికారులను అడుగుతుంటే మేము పంపించాము. వాళ్లు వేయలేదు. మేము ఏమీ చేయలేం అంటున్నారు. నగదు జమ అయ్యేలా చూడాలి. – ఎ.శ్రావణి, జూపూడి



నగదు జమ అయ్యేలా కృషి

ప్రధానమంత్రి మాతృ వందన యోజన ఇప్పటి వరకు ఆరోగ్య శాఖ పరిధిలో ఉంది. ఈనెలలోనే ఐసీడీఎస్ వారికి అప్పగించారు. ఇప్పుడే రిజిస్ట్రేషన్‌ల కార్యక్రమం ప్రారంభించాం. వీలైనంత వరకు గర్భిణుల నమోదు కార్యక్రమం పూర్తి చేస్తాం. సకాలంలో ఖాతాల్లో నగదు జమ అయ్యేలా కృషి చేస్తాం. –కె.పుష్పలత, సీడీపీఓ, మైలవరం



క్లుప్తంగా

బ్యాంకు ఉద్యోగాలకు పరీక్ష



తిరువూరు: స్థానిక శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం భారతీయ స్టేట్ బ్యాంకు క్లరికల్ కేడర్ ఉద్యోగాలకు ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించారు. శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు 8 సెషన్స్‌లో 1200 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు తెలిపారు. ప్రవేశ పరీక్షను నిబంధనల మేరకు నిర్వహించామన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ



విస్సన్నపేట: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ 1981–82 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి రూ.2,11,600 పాఠశాల హెచ్‌ఎం శోభారాణికి ఆదివారం అందజేశారు. తాము చదివిన పాఠశాల అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో స్వచ్ఛందంగా ఈ మొత్తాన్ని అందజేశామని పూర్వ విద్యార్థులు తెలిపారు. పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు జగ్గవరపు రంగారెడ్డి, ఎన్టీ వెంకటేశ్వరరావు సమక్షంలో హెచ్‌ఎంకు పూర్వ విద్యార్థులు నగదు అందజేశారు.

చనుబండలో స్వచ్ఛ భారత్



చాట్రాయి: చనుబండ గ్రామంలో ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం చుట్టూ చెత్తచెదారాన్ని తొలగించారు. సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి, బీజేపీ నాయకులు బుర్రె శ్రీకర్, టీడీపీ నాయకుడు చీదిరాల మారేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

కొమ్మిరెడ్డిపల్లిలో ఆర్‌ఓ ప్లాంటు ప్రారంభం



కొమ్మిరెడ్డిపల్లి(తిరువూరురూరల్): మండలంలోని కొమ్మిరెడ్డిపల్లిలో వైఎస్సార్ సీపీ తిరువూరు మండల మాజీ అధ్యక్షుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి కుటుంబ సభ్యుల వితరణతో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంటును ఆదివారం ప్రారంభించారు. గ్రామంలో రక్షిత మంచినీరు లేక ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని, ఆర్‌ఓ ప్లాంటు ఏర్పాటు చేయాలని గతంలో గ్రామస్తులు చేసిన విజ్ఞప్తి మేరకు రూ.3 లక్షలతో నిర్మించామని నాగనర్సిరెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం నాయకుడు వెదురు గోపిరెడ్డి, మునుకుళ్ల గ్రామ మాజీ సర్పంచి శీలం సంధ్యారాణి, కొమ్మిరెడ్డిపల్లి సర్పంచి బంకా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని నిరసన చేపట్టాం

స్పష్టం చేసిన న్యాయవాదుల సంఘం

నూజివీడు: ఎన్నికల ముందు నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో కలుపుతామని ఇచ్చిన హామీని ప్రభుత్వ పెద్దలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శనకు పిలుపు ఇచ్చామే తప్ప మేము మంత్రి కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఎక్కడా చెప్పలేదని నూజివీడు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు మన్నం రమేష్, సెక్రటరీ వై. హరిబాబు, మాజీ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్, సీనియర్ న్యాయవాదులు వైఎస్ దొర్రై, మడుపల్లి మధు రవిశంకర్, పల్లగాని రాంబాబు, గోళ్ల ప్రసాద్ ఆదివారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. తాము నిరసన ప్రదర్శన చేయాలనుకున్నది మంత్రి కార్యాలయం ఎదుట కాదని, ప్రధాన రహదారికి అవతలి వైపున ఉన్న మరో రహదారిపైన మాత్రమేనన్నారు. వాస్తవం ఇలా ఉండగా కొందరు మంత్రి కార్యాలయం ముట్టడి అని వక్రభాష్యం చెప్పి అసలు విషయాన్ని డైవర్ట్ చేయడానికి ప్రయత్నం చేశారన్నారు. తాము పోలీసుల సూచనల ప్రకారమే నిరసన ప్రదర్శన చేశామని చెప్పారు. న్యాయవాదుల వెనుక ఎవరో ఉండి నడిపిస్తున్నారని, మంత్రి పైన బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని కొందరు ప్రచారం చేయడం తగదన్నారు.

గోవులను తరలిస్తున్న 8 మందిపై కేసు

మైలవరం: గోవులను అక్రమంగా ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్న ఎనిమిది మందిపై ఆదివారం కేసు నమోదైంది. ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మైలవరం పరిసర ప్రాంతాలలో గోవులను కొనుగోలు చేసి మండలంలోని చంద్రాల గ్రామం నుంచి ఆటోలలో హైదరాబాద్, కేరళ రాష్ట్రానికి తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో రెండు ఆటోలు, హైదరాబాద్‌కు చెందిన నలుగురు, మరో ఇద్దరు ఆటో డ్రైవర్లు, చంద్రాల గ్రామానికి చెందిన ఒకరు, హైదరాబాద్‌కు చెందిన మరొకరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. 34 గోవులను స్వాధీనం చేసుకుని గోశాలకు తరలించారు.

అక్రమ కేసులకు భయపడం

వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు

తిరువూరు: కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమై ప్రశ్నించే ప్రతిపక్షాన్ని గొంతు నొక్కాలని చూస్తోందని, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే సహించబోమని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. ఆదివారం తిరువూరు సూర్య ఫంక్షన్ హాల్లో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న కారణాలతో వైఎస్సార్‌పీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా కార్యకర్తలను గ్రామ స్థాయిలో వేధింపులకు గురిచేయడం, కేసులు బనాయించడం కూటమి ప్రభుత్వానికి పరిపాటైందన్నారు. ఇటువంటి బెదిరింపు చర్యలకు భయపడవద్దని, పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. నిరుద్యోగులు, మహిళలు, యువతులకు ఆర్థికసాయం అందజేస్తామన్న హామీని అమలు చేయకపోగా, సూపర్ సిక్స్ సూపర్ హిట్ పేరుతో బహిరంగ సభ నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ, రైతులకు యూరియా సరఫరాలో వైఫల్యంతో కూటమి ప్రభుత్వంపై ప్రజలు నిప్పులు చెరుగుతున్నారన్నారు. గ్రామ, మండల స్థాయిల్లో కార్యకర్తలకు ఎటువంటి అన్యాయం జరిగినా, అక్రమ కేసులు బనాయించాలని చూసినా సహించబోమని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ తిరువూరు మండల, పట్టణ అధ్యక్షులు తాళ్లూరి నవీన్, చలమాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, భూక్యా గన్యా, శామ్యూల్, లోకేశ్వరరెడ్డి, పార్టీ నాయకులు రేగళ్ల మోహనరెడ్డి, నరెడ్ల వీరారెడ్డి, దుర్గారావు, పల్లెపాము లక్ష్మయ్య, షేక్ జాకీర్, పి. సుధారాణి, యరదేశి రామారావు, కాలసాని గోపాల నాగేశ్వరరావు, శిరసాని ప్రకాష్, మోదుగు ప్రసాద్, ఆలపాటి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్వామిదాసు

అడబిడ్డను కట్టేసి కొట్టడం మగతనమా

మాజీ మంత్రి జోగి రమేష్

జి.కొండూరు: అప్పుగా ఇచ్చిన డబ్బులను తిరిగి ఇవ్వమని అడిగినందుకు ఆడబిడ్డ అనే కనికరం కూడా లేకుండా స్తంభానికి కట్టేసి కొట్టిన పద్ధతి చూస్తే సభ్య సమాజం తలదించుకునే పరిస్థితి ఈ ప్రభుత్వంలో దాపురించిందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్ అన్నారు. జి.కొండూరు మండల పరిధి గుర్రాజుపాలెం గ్రామంలో టీడీపీ నాయకుల దాడిలో గాయపడి మతిస్థిమితం కోల్పోయిన మద్దాల మాధవిని చిన్న నందిగామ గ్రామంలో ఆమె ఇంట్లో జోగి రమేష్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమెకు అవసరమై వైద్యం అందించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పచ్చని పల్లెల్లో టీడీపీ అల్లర్లు

జోగి రమేష్ మాట్లాడుతూ ప్రశాంతంగా ఉండే పచ్చటి పల్లెల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు అల్లర్లు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. అప్పు ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగినందుకు మాధవి అనే మహిళను, ఆమె కుమారుడు భువనేంద్రపై విచక్షణా రహితంగా దాడి చేయడమే కాకుండా తమకు లోకేష్ తెలుసునని, తమను ఎవ్వరూ ఏమీ చేయలేరని బెదిరిస్తున్న తీరు విస్మయానికి గురిచేస్తోందన్నారు.


బాధితులపైనే కేసులు పెట్టడం దుర్మార్గం

కనీసం మాట్లాడలేని స్థితిలో ఉన్న బాధిత మహిళ మాధవిని పోలీసులు సంప్రదించకపోగా తిరిగి బాధితులపైనే కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. దాడి చేసిన నిందితులను వారం గడిచినా ఇప్పటి వరకు అరెస్టు చేయకపోవడం వెనక రాజకీయ కుట్ర ఉందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వాలు శాశ్వతంగా ఉండవని, ఇటువంటి సంఘ విద్రోహ శక్తులకు అండగా నిలిచిన అధికారులు కూడా భవిష్యత్‌లో మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. బాధిత మహిళ మాధవి కుటుంబానికి న్యాయం జరిగే వరకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, వైఎస్సార్ సీపీ జి.కొండూరు మండల అధ్యక్షుడు జడ రాంబాబు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి, స్టేట్ ఐటీ వింగ్ సహాయ కార్యదర్శి కుమ్మరి నాగరాజు, పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గోగులమూడి రాణి, వివిధ విభాగాల కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.




టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన మాధవిని పరామర్శిస్తున్న జోగి రమేష్

రోడ్డుపై నీటి నిల్వతో ఇబ్బందులు



చిన్నంపేట ఆర్‌అండ్‌బీ రోడ్డుపై గుంతల్లో నిలిచిన నీరు



చనుబండ పాత దళితవాడ రోడ్డుపై నిలిచిన నీరు

చాట్రాయి: వర్షం నీరు రహదారిపై ఏర్పడిన గుంతల్లో నిలవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మండల పరిధి చిన్నంపేట గ్రామంలోని మెయిన్ స్కూల్ నుంచి దళితవాడ ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వర్షం నీరు నిలిచి చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. ఈ గుంతల్లో రోజుల తరబడి నీరు నిలిచిపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. చనుబండ పాత దళితవాడ సీఎస్‌ఐ చర్చి వద్ద లోతట్టుగా ఉన్న రోడ్డుపై నీరు రోజుల తరబడి నిలిచి ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ మార్గం నుంచే మెయిన్ స్కూల్‌కు పిల్లలు బురదలో నడుచుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి. కొత్త దళితవాడలోని రోడ్డు జలమయమై నీళ్లు నిలిచిపోతుండటంతో కాలనీ వాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. చాట్రాయి సెంటర్ నుంచి బూరుగుగూడెం వెళ్లే రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ రాజకీయ వ్యభిచారి

మాజీ మంత్రి జోగి రమేష్ విమర్శ

ఇబ్రహీంపట్నం: స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ రాజకీయ వ్యభిచారి అని మాజీ మంత్రి జోగి రమేష్ విమర్శించారు. అసెంబ్లీలో స్థానిక సమస్యలు ప్రస్తావించలేదని ఆరోపణలు చేసిన జోగి రమేష్ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ చేసిన వ్యాఖ్యలను జోగి రమేష్ ఖండించారు. ఆయన నివాసంలో ఓ చానల్‌తో మాట్లాడుతూ ఎమ్మెల్యేపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. 2024 ఎన్నికల్లో దేవినేని ఉమాని కాదని టీడీపీలో నీకు ఏ విధంగా ఎమ్మెల్యే సీటు వచ్చిందో అందరికీ తెలుసన్నారు. నువ్వా నా గురించి మాట్లాడేదని మండిపడ్డారు. ఎన్టీటీపీఎస్ బూడిద కాలుష్యం వల్ల ఎన్నో గ్రామాల ప్రజలు చర్మ వ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలతో ఇబ్బంది పడటం నిజం కాదా అని నిలదీశారు. ఇప్పుడున్నది నీ ప్రభుత్వమే కదా అసెంబ్లీ సాక్షిగా బూడిద టెండర్ రద్దు చేయించి స్థానిక లారీ ఓనర్లకు బూడిద అప్పగించ గలవా అని ప్రశ్నించారు. అక్రమంగా డంపు చేసిన బూడిద ఎవరిది అనే దానిపై నిజనిర్ధారణకు నేను మూలపాడు వెళుతుంటే నన్ను వెళ్లకుండా ఆపి పోలీసుల ద్వారా అరెస్ట్ చేయించింది నువ్వు, నీ ప్రభుత్వం కాదా అని అన్నారు. నేను స్థానిక ఎమ్మెల్యేను కాను, అదే ఇక్కడ నేను ఎమ్మెల్యే అయితే ఏనాడో బూడిద సమస్యలకు పరిష్కారం చూపే వాడినని చెప్పారు. సవాల్ విసురుతున్న నీవు సీఎం చంద్రబాబుని ఒప్పించి నీ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రా.. ఉప ఎన్నికల్లో నీకు డిపాజిట్లు వస్తాయో లేదో చూద్దువు గాని. లేదా 2029లో అయినా నేను రెడీ చూసుకుందాం నివ్వేంటో, నేనేంటో అని సవాల్ విసిరారు.



ఎప్పుడు ఏ పార్టీలో ఉంటాడో..

2019లో నీకు ఎమ్మెల్యే సీటు ఇచ్చింది ఎవరు, 2024లో నీకు సీట్ ఇచ్చింది ఎవరు, ఎప్పుడు ఏ పార్టీలో ఉంటావో నీకు తెలియదని ఎద్దేవా చేశారు. నువ్వు నా గురించి మాట్లాడతావా అని హేళన చేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, ఈవీఎం గాలిలో నువ్వు గెలిచావు. నువ్వు గెలిచేది ఏంటి? ఆ గాలిలో తిరువూరు ఎమ్మెల్యే గెలవలేదా, 2019లో అయినా 2024లో అయినా ఎవరో ఒకరి గాలిలో గెలిచిన వాడివే అన్నారు. నా బ్రాండ్ వైఎస్సార్. ఆయన శిష్యుడిగా నేను రాజకీయాల్లోకి వచ్చా. నేను వేరే పార్టీ మారలేదన్నారు. నిక్కర్లు వేసుకున్నప్పటి నుంచి రాజకీయాల్లో ఉన్నా, కింది స్థాయి నుంచి కష్టపడి పైకి వచ్చిన వాడినని గుర్తుచేశారు. ఏ అంశం మీద చర్చ పెట్టుకుందామన్నా నేను సిద్ధమన్నారు.

దసరా ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు

ఆగిరిపల్లి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు స్థానిక రుద్రభూమి వద్ద వేంచేసి ఉన్న స్వయంభు కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం బాలా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిస్తారని, రోజుకొక అలంకారంలో పూజలందుకుంటారని ఆలయ కార్యనిర్వహణాధికారి సాయి తెలిపారు. విజయ దశమి రోజున భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

విస్సన్నపేట: స్థానిక ద్వారకా నగర్‌లోని కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో సోమవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిస్తారని చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా రోజుకొక అలంకారంలో అమ్మవారు పూజలందుకుంటారన్నారు. 3న అమ్మవారి ఊరేగింపు, 4న దేవస్థానం వద్ద అన్నసమారాధన జరుగుతుందని చెప్పారు.

ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలన

ఇబ్రహీంపట్నం: విజయ దశమిని పురస్కరించుకుని విజయ నర్తకి పేరుతో పదకొండు రోజుల పాటు పవిత్ర సంగమం వద్ద ఉత్సవాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ ఆదివారం ఆప్రాంతంలో ఏర్పాట్లు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక కేంద్రంగా మారిన పవిత్ర సంగమం వద్ద పదకొండు రోజుల పాటు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. దసరా వేడుకలు సందర్భంగా నిత్య హారతులు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. పవిత్ర సంగమానికి పూర్వ వైభవం తెచ్చేలా కృషి చేస్తామన్నారు. మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, నాయకులు పాల్గొన్నారు.



ఆగిరిపల్లి ఆలయంలో కనకదుర్గమ్మ అమ్మవారు

దసరా నవరాత్రులకు సన్నాహాలు

● **చాట్రాయి:** దేవీ నవరాత్రి ఉత్సవాలు నిర్వహణకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో కనకదుర్గ అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేయడానికి పందిళ్లు, రంగు రంగుల విద్యుత్ దీపాల అలంకరణలు ఏర్పాటు చేస్తున్నారు. నవరాత్రుల్లో 9 అలంకరణల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు.

గురజాడ రచనలు అజరామరం

అభ్యుదయ రచయితల సంఘం నివాళి

తిరువూరు: అభ్యుదయ కవి గురజాడ అప్పారావు రచనలు ఎన్ని తరాలైనా అజరామరంగా నిలుస్తా యని అభ్యుదయ రచయితల సంఘ జిల్లా మాజీ కార్యదర్శి పసుపులేటి వెంకయ్య అన్నారు. తిరువూరు గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో ఆదివారం గురజాడ జయంతి కార్యక్రమం తిరువూరు రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. వెంకయ్య మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం పంతులులోని సంస్కరణ భావాలు, గిడుగు రామ్మూర్తి వ్యావహారిక భాషా శైలి మేళవించి గురజాడ సాహితీరంగంలో నూతన అధ్యాయానికి పునాది వేశారన్నారు. సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉ య్యూరు అనసూయ, రేపాక రఘునందన్, ప్రము ఖ న్యాయవాది తాళ్లూరి రామారావు, జన విజ్ఞాన వేదిక సభ్యులు కె. పాపారావు, తిరువూరు రచ యితల సంఘ కార్యదర్శులు భరతకుమారి, రజని, వాణి, రంగారావు తదితరులు గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గురజాడ రాసిన కన్యాశుల్కం, పూర్ణమ్మ కథ, ముత్యాలసరాలు వంటి రచనలు సామాజిక సమస్యలే ప్రధానాంశాలుగా ఖ్యాతి గడించాయన్నారు. ఇటీవల మరణించిన రచయితల సంఘ సభ్యుడు నారాయణపురపు కుమార్‌కు సభ్యులు నివాళులర్పించారు.



రామకృష్ణ నగర్ వికాస మండలి ఏర్పాటు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లి గ్రామ శివారు రామకృష్ణ నగర్‌లో సమస్యల పరిష్కారం కోసం అక్కడి ప్రజలు సమన్వయంతో ముందుగుకు సాగుతున్నారు. కాలనీలో పెద్దలు అందరూ ఆదివారం సమావేశమయ్యారు. తమ ప్రాంత అభివృద్ధికి తొమ్మిది మందితో రామకృష్ణనగర్ వికాస మండలిగా ఏర్పడ్డారు. ఈ ప్రాంతంలో రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీరు తదితర సదుపాయంతో పాటు కాలనీ ఖాళీ స్థలంలో పార్క్ చేర్పాటు చేసుకోవాలని తీర్మానించారు. వికాస మండలి అధ్యక్షుడిగా చుక్కపల్లి వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. మండలి సభ్యులను కాలనీ వాసులు అభినందించారు.

విద్యార్థులకు నగదు బహుమతుల పంపిణీ

మైలవరం: వెల్వడం సరస్వతీ ఫౌండేషన్, పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో మండల స్థాయిలో ప్రతిభ చూపిన పదో తరగతి విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశామని గోపాల్ ఆదివారం తెలిపారు. సర్వస్వతీ ఫౌండేషన్ కుడుముల తిమ్మారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు డాక్టర్ అనిల్ కుమార్ రెడ్డి విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. మండల స్థాయిలో ప్రథమ బహుమతి రూ.15 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలు, ప్రతి ప్రభుత్వ పాఠశాల మొదటి విద్యార్థికి రూ.3 వేల చొప్పున అందజేశారు. మైలవరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రాజకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ బాబూరావు, ఎంఈఓ ఎల్. బాలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించి సంబంధిత అధికారులకు పంపి గడువులోగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ఏరియా ఆస్పత్రిలో మెగా వైద్యశిబిరం

నూజివీడు: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సోమవారం స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజారాణి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్, ఎన్‌సీడీ స్క్రీనింగ్, గర్భిణీ సంరక్షణ, టీకాలు, రక్తహీనత స్క్రీనింగ్, టీబీ స్క్రీనింగ్, మహిళల కోసం ఆరోగ్య పరీక్షలు, చెవి, ముక్కు, గొంతు, దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు.

మహిళలకు వైద్య పరీక్షలు

మైలవరం: స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ తమ్మా సీతారావమ్మ అన్నారు. గణపవరం పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ మహిళల ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. స్థానిక నాయకులు వజ్రాల బుజ్జిరెడ్డి, ఎన్. శ్యామ్‌ప్రసాద్, టి. శివకృష్ణ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సుష్మ తదితరులు పాల్గొన్నారు.

● **మైలవరం:** రెడ్డిగూడెం మండలం అన్నేరావుపేట గ్రామంలో ఆదివారం మహిళలకు వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సర్పంచ్ బాణావత్ ప్రశాంతి, ఎంపీటీసీ ఎస్. మధులత, రెడ్డిగూడెం పీహెచ్‌సీ వైద్యులు కీర్తి, శ్యాంసుందరరావు, బీజేపీ నాయకుడు, బలగాని గోపి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● **పైడూరుపాడు(విజయవాడరూరల్):** పైడూరుపాడు గ్రామంలో జరిగిన వైద్యశిబిరంలో రక్తహీనత, వ్యక్తిగత పరిశుభ్రత, టీబీ స్క్రీనింగ్ తదితర సమస్యలకు సంబంధించి 120 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ డి.శిరీష, సర్పంచి వి.సీతారామయ్య, ఏఎన్‌ఎం రాణి, ఆశా వర్కర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె.మాధవి పాల్గొన్నారు.